మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అ క్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

కేటీఆర్ వాహనంపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 1 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాహనంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదల కోసం బీఆర్ఎస్ చేపట్టిన ఉద్యమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దాడులతో అడ్డుకోలేదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసి, దాడులు చేస్తూ రౌడీ, బుల్డోజర్ రాజ్యంగా పనిచేస్తుందని విమర్శించారు. ముందుగా కాంగ్రెస్ మంత్రుల ఫాంహౌస్‌లను కూలగొట్టాలని డిమాండ్ చేశారు. వీళ్లు ప్రభుత్వాన్ని నడుపుతున్నారో, సర్కస్ నడుపుతున్నారో తెలుస్తలేదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ప్రజలు ఓట్లేయలేదని వాళ్లపై పగ తీర్చుకుంటామంటే ఊరుకోమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్ పై దాడి చేసిన దుండగులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎఫ్‌డీసీ కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 1 : త్వరలో ప్రతి ఇంటికీ అందించబోయే ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై కలెక్టర్, ఉన్నతాధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 3 నుంచి ఎఫ్‌డీసీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక మున్సిపల్ పట్టణం, ఒక గ్రామంలో వివరాలు సేకరించాలన్నారు. ఈనెల 8 వరకు పూర్తి చేయాలని, 9న స్క్రూటినీ చేసి, 10న నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ పమేల సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్, ఆర్‌డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల మార్గదర్శకాల్లో మార్పులు

కలెక్టరేట్, అక్టోబర్ 1 : 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలో అర్హులైన షెడ్యూలు కులాల విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు అవసరమైన మార్గదర్శకాల్లో మార్పులు చేసినట్లు, షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు ఎం నాగైలేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులో ఎస్ఎస్‌సీ మెమోలో ఉన్న చిరునామా, ఇతర వివరాలు ఉండాలని సూచించారు. రూ.2.50 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న ప్రతి విద్యార్థి ఈ-పాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎస్ఎస్‌సీ వివరాలు, ఆధార్‌కార్డు వివరాలతో సరిపోల్చిన తర్వాతనే తాత్కాలిక 12 అంకెల ఈ-పాస్ ఐడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ-పాస్ ఐడీ నంబర్‌తో దగ్గరిలోని మీసేవా కేంద్రంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. నమోదు ప్రక్రియ పూర్తి చేసి దృవపత్రాలు జతపర్చి, తమ తమ కళాశాల్లో అందజేయాలని సూచించారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశానికి గడువు పొడిగింపు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 1 : బీఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 73829 29755 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బస్టేషన్‌లో బస్సెక్కుతున్న ప్రయాణికులు

వెళ్లడానికి బస్సుల్లేవ్..

ప్రయాణికులతో కిక్కిరిసిన కరీంనగర్ బస్టేషన్

ఈ నెల 2 నుంచి బతుకమ్మ, దసరా సెలవులు ప్రారంభం కావడంతో నగరాలు, పట్టణాల్లో నివాసముండే ప్రజలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు మంగళవారం తమ సొంతూళ్లకు పయనమయ్యారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రావడంతో బస్టాండ్‌లు కిక్కిరిసిపోయాయి. అయితే, అందుకు తగినట్టుగా బస్సులు లేక పోవడంతో గంటల తరబడి నిరీక్షించారు. కరీంనగర్ బస్టేషన్‌కు వేలాది మంది ప్రయాణికులు పోటెత్తడంతో ప్రాంగణమంతా నిండిపోయింది. బస్సులు లేక అనేక మంది గంటల తరబడి నిరీక్షించగా, వచ్చిన బస్సుల్లో అవస్థలు పడుతూ ఎక్కాల్సి వచ్చింది. పరిమితికి మించిన ప్రయాణికులతో బస్సులు రోడ్లెక్కాల్సి వచ్చింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

పరిమితికి మించి ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం!

పలువురు ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తిమ్మాపూర్ మోడల్ స్కూల్‌కు పలు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులను ఈ ఫొటోలో కనిపిస్తున్న విధంగా ఒక్కో ఆటోలో 15 నుంచి 20 మందిని తీసుకెళ్తున్నారు. ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న వారిని చూసిన పలువురు 'పిల్లల చదువు దేవుడెరుగు.. సవ్యంగా ఇంటికెళ్లే చాలు' అంటూ చర్చించుకుంటున్నారు. సరైన బస్సు వసతి లేక ఇలా ప్రైవేటుగా నెలకు రూ.500లకు ఆటో మాట్లాడుకుని వెళ్తుండగా, సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. - తిమ్మాపూర్,అక్టోబర్1

ప్రమాదకరంగా వెళ్తున్న ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, అక్టోబర్ 1 : జాతీయ, రాష్ట్ర స్థాయి అండర్-14, 16 జూడో, అథ్లెటిక్స్ కాంపిటీషన్స్‌లో జాతీయ స్థాయిలో 2, రాష్ట్ర స్థాయిలో 2 రజత పతకాలు సాధించిన స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. గత నెల 10 నుంచి 13 వరకు చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి జూడో పోటీల్లో రేవతిరెడ్డి, అంకిత నాయక్ సిల్వర్ పతకాలు సాధించారు. 19, 20వ తేదీల్లో ఓయూలో జరిగిన అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో కే జాహ్నవి, కే రేవతిరెడ్డి రాష్ట్ర స్థాయిలో రజత పథకాలు సాధించారు. కాగా, వీరిని కలెక్టర్ అభినందించి ఈ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీడీపీగా శరత్

శరత్

కోర్టుచౌరస్తా, అక్టోబర్ 1 : కరీంనగర్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధరావత్ శరత్‌ను తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నియమించగా, ఆయన మంగళవారం జిల్లా కోర్టులో బాధ్యతలు చేపట్టారు. శరత్ ఇంతకు ముందు హుజూరాబాద్ సబ్ కోర్ట్ అడిషనల్ పీపీగా బాధ్యతలు నిర్వహించగా, పదోన్నతిపై కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. డీడీపీగా బాధ్యతలు చేపట్టిన శరత్ ఉమ్మడి జిల్లా వ్యాప్త ప్రాసిక్యూటర్ల పరిపాలన బాధ్యతలు చూస్తారు. మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీగా ఉన్న రామ్ భక్ష్ పదోన్నతిపై కరీంనగర్ జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీ కాగా, ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. హుజూరాబాద్ సబ్ కోర్ట్ ఇన్‌చార్జి అడిషనల్ పీపీగా గౌరు రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

పోక్సో కోర్టు ఏపీపీ నియామకం

కుమారస్వామి

కోర్టుచౌరస్తా, అక్టోబర్ 1 : కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాది పంజాల కుమారస్వామిని కరీంనగర్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు, ఫోక్సో చట్టం కేసుల విచారణ కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీవో జారీ చేశారు. అడిషనల్ పీపీగా కుమారస్వామి మూడేళ్లు పదవిలో కొనసాగున్నట్లు ఆ జీవోలో తెలిపారు. కుమారస్వామిది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అంతకపేట కాగా, ఆయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బావిలో పడ్డ మహిళ

కాపాడిన రెస్క్యూ టీం

రాంనగర్, అక్టోబర్ 1 : ప్రమాదవశాత్తు ఇంటి వెనుక బావిలో పడిన మహిళను ఫైర్ రెస్క్యూటీం సిబ్బంది క్షేమంగా కాపాడారు. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన రమాదేవి (43) మంగళవారం తెల్లవారుజామున ఇంటి వెనుకాల ఉన్న చేద బావిలో ప్రమాదవశాత్తు జారి పడింది. కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన రెస్క్యూటీం సిబ్బంది తాళ్ల సహాయంతో లోపలికి దిగి ఆమెను క్షేమంగా బయటికి తీసుకువచ్చారు.

బొమ్మకల్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 1 : కరీంనగర్ మండలంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ నియమించారు. ఇందులో పోలీస్ శాఖ నుంచి సీఐ ప్రదీప్‌కుమార్, తహసీల్దార్ రాజు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఫైర్ విభాగం, ఆర్ అండ్‌బీ శాఖ నుంచి ఒక్కరి చొప్పున సభ్యులుగా ఉన్నారు. బొమ్మకల్‌లోని బైపాస్ రోడ్డు సర్వేనెంబర్ 224డి లో గల ఐదు అక్రమ కట్టడాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా 5 కట్టడాలు, రేకుల షెడ్డు నిర్మించగా పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్మాణదారులు స్పందించకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేశారు.

వృద్ధులపై ప్రేమ, వాత్సల్యం పంచాలి

కలెక్టర్ పమేల సత్పతి

కలెక్టరేట్, అక్టోబర్ 1 : వృద్ధులపై ప్రతి ఒక్కరూ ప్రేమ, వాత్సల్యం పంచాలని, వారి సంతానం వీలైనంత సమయం కేటాయించి వారి బాగోగులు చూడాలని కలెక్టర్ పమేల సత్పతి సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శా